క్లుప్తంగా

ఘనంగా ముగిసిన గురు పూర్ణిమ ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా–నాగమానసాదేవి మందిరంలో గురు పూర్ణిమ మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధా స్వామి ఆధ్వర్యాన బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ముగింపు ఉత్సవాలలో భాగంగా బాబావారి పల్లకీ సేవ, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముగింపు ఉత్సవాలలో భాగంగా సాయిబాబా భజన మండలి అధ్యక్షుడు జక్కిలంక రాజారావును ఆలయ వ్యవస్థాపకుడు సుధాస్వామి శాలువా కప్పి, బాబావారి చిత్రపటం శేషవస్త్రంతో సత్కరించారు.

భార్య, కుమారుడు కనిపించటం లేదంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమారుడితో పాటు తన భార్య కనిపించటం లేదంటూ గురువారం గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెట్టపల్లి గ్రామానికి చెందిన సునీల్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు మూడు సంవత్సరాల క్రితం శృతితో వివాహం అయ్యింది. గత నెల 25వ తేదీన సునీల్ చిన్న కుమారునికి నిమ్ము ఉండటంతో చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఆస్పత్రిలో సునీల్ అత్త అటెండర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 5వ తేదీన సునీల్‌కు ఊరిలో పని ఉండటంతో ఊరు వెళ్లారు. అదే సమయంలో సునీల్ అత్త సైతం తెలిసిన వాళ్లకు ఆరోగ్యం బాగాలేకపోవటంతో ఊరు వెళ్లారు. అదే సందర్భంలో సునీల్ భార్య 5వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయించుకుని వెళ్లిపోయారు. సాయంత్రం 4 గంటలకు ఆస్పత్రికి వచ్చిన సునీల్‌కు డిశ్చార్జయినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. దీంతో సునీల్ తెలిసిన వారి వద్ద చుట్టు పక్కల, అత్త వారి ఊరిలోనూ విచారించినా ఫలితం లేకపోవటంతో గురువారం గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

షిర్డీ సాయి సేవలో పీలేరు ఎమ్మెల్యే



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం బాబాను పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అర్చకుడు ఆలయ మర్యాదలతో రామచంద్రారెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం బాబాకు ప్రత్యేక పూజలు విశేషంగా హారతులు ఇచ్చి బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బాబావారిని దర్శించుకోవటం ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న మందిర సేవలను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం గణపతి స్వామికి అభిషేకాలు, విశేష పూజ , గణపతి హోమాన్ని నిర్వహించారు. ఇంద్రకీలాద్రికిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గణపతి ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాల అనంతరం గణపతి హోమం నిర్వహించారు. స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షణలో యజ్ఞనారాయణ శర్మ, ఇతర ఆలయ అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలు ఆదర్శనీయం



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు



బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బెజ్జం రవికుమార్ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తన జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని, ఆయన జీవిత ఆశయాలు దేశానికే ఆదర్శనీయమని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం సింగ్‌నగర్, వాంబేకాలనీ పరిసర ప్రాంతాల్లో గురువారం నిర్వహించారు. సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా పాల్గొని ముందుగా స్థానిక దళిత సంఘాల నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక నాయకులు ఎండీ హఫీజుల్లా, ఆదిరాల విజయ్‌కుమార్, వింజమూరి వందనంబాబు, షేక్ అమిత్, గెల్లిపోగు రాజు, చింతా శ్రీను, షేక్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

- బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపాలని బాబూ జగ్జీవన్‌రామ్ కన్న కలలను, ఆయన ఆశయాలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని జనంలో మనం స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొదిగింటి నాగరాజు అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్‌సీపీ 60వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. స్థానిక నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాని, ఇస్మాయేల్, బాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.
- స్థానిక 59వ డివిజన్ సింగ్‌నగర్ లూనాసెంటర్‌లోని బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు తెలుగు బాప్టిస్ట్ చర్చస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రెవ. మంగలపూడి జోసఫ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కంభగళ్ల రాజు, ఆదిరాల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



లూనాసెంటర్‌లో మాట్లాడుతున్న జోసఫ్, దళిత సంఘాల నాయకులు

మానవతావాది బాబూ జగ్జీవన్‌రామ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ చేసిన సేవలు ప్రతి ఒక్కరి హృదయాలలో ఎన్నటికీ నిలిచే ఉంటాయని వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్ అన్నారు. స్థానిక జీఎస్ రాజు రోడ్డులో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు గుడిసే శ్యామ్ ఆధ్వర్యాన బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన పాల్గొని బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, ఎస్సీసెల్ నాయకులు బత్తుల సుబ్బారావు, ఎం. సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి పాటు పడిన జగ్జీవన్..

పాయకాపురం(విజయవాడరూరల్): భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ పేదప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన మహావ్యక్తని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు.గురువారం ఎల్‌బీఎస్ నగర్లోని మూడు బొమ్మల సెంటర్లో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్,కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జగ్జీవన్‌రామ్ సేవలు స్ఫూర్తిదాయకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశానికి ఉపప్రధానిగా బాబూజగ్జీవన్‌రామ్ అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం గిరిపురంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కుక్కల అనిత

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

ఆటోనగర్(విజయవాడతూర్పు): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహోన్నత వ్యక్తి అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. 16వ డివిజన్‌లోని చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ తపాలా కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, జాతీయ కమిషన్ సభ్యులు (ఎస్సీ) డాక్టర్ అంజు బాల మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహా వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ మార్గంలో నడుస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఒక దిక్సూచి లాగా పని చేస్తుందన్నారు. ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ కార్యదర్శి దాసరి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో హోం మంత్రి తానేటి వనిత, అంజు బాలాజి తదితరులు

జగనన్న మహిళా మార్ట్‌తో సుస్థిర ఉపాధి

ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న మహిళా మార్ట్‌తో మహిళలకు సుస్థిర ఉపాధి లభిస్తుందని, ప్రతీ మహిళ జగనన్న మహిళా మార్ట్‌తో ఆర్థిక స్వావలంభన సాధించాలని ఎమ్మెల్యే, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. స్థానిక గవర్నర్‌పేట ఐవీ ప్యాలెస్‌లో గురువారం నగరపాలకసంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యాన మహిళలకు సుస్థిర జీవనోపాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆసరా, చేయూత వంటి పథకాలతో పాటు జగనన్న మహిళా మార్ట్ మహిళల జీవితాలలో నూతన వెలుగులు ప్రసరింప చేస్తున్నాయన్నారు. మెప్మా ఎండీ విజయలక్ష్మి, ప్రాజెక్టు ఆఫీసర్ కె. శకుంతల మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సద్వియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఇళ్ల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయండి

పటమట(విజయవాడతూర్పు): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కొత్త భవనంలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మొత్తం 7,210 ఇళ్లకు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నామన్నారు. అందులో వాంబేకాలనీ 3,373, న్యూరాజరాజేశ్వరీ పేట 2,939, పాయకపురం, ఊర్మిళనగర్, కె.ఎల్.రావు నగర్ 898 ఇళ్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల రిజిస్ట్రేషన్లలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులు, సిబ్బందికి సూచించారు.

రూ.23 కోట్లతో డివిజన్‌లో అభివృద్ధి

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన 30వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.23 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ 246 వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ జానారెడ్డి, నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుని సత్వర పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో డివిజన్‌ను పట్టించుకోలేదని అందినకాడికి దండుకోవటమే ధ్యేయంగా పనిచేశారన్నారు. ఇక్కడ డివిజన్‌లో కనీసం ఆరోగ్యకేంద్రం కానీ, వాటర్ ట్యాంక్ గానీ లేదని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సమస్యలను గుర్తించి నాలుగేళ్లలో ఒకవైపు సంక్షేమ పథకాలు అందిస్తూనే, మరోవైపు రూ. 23 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

బుడమేరు ప్రక్షాళన..

గత ప్రభుత్వ హయాంలో బుడమేరును కేవలం ఆక్రమించుకోవటమే ధ్యేయంగా పనిచేశారని దీంతో నీరు పారక దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బుడమేరును ప్రక్షాళన చేయటంతో పాటు నిత్యం దోమల నివారణ చర్యలు నిర్వహిస్తున్నామన్నారు.



డివిజన్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

రూ.9కోట్లతో రోడ్డు పనులు

డివిజన్‌లో రూ. 9 కోట్ల వ్యయంతో రోడ్డు పనులు చేపట్టామన్నారు. ఆ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వరకు ప్రధాన రహదారిని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. దేవీనగర్, దావుబుచ్చయ్య కాలనీ, ఉలవచారు కంపెనీ మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు ప్రధాన రహదారి నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఈ(ఇంజినీరింగ్) గురునాథం, ఏఎంఓహెచ్ డాక్టర్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, విద్యుత్ శాఖ ఏఈ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్ని శాఖల అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సాంబశివరావు



కంకిపాడు(పెనమలూరు): వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణాజిల్లా పెనమలూరు మండలంలోని గొడవర్రు జెడ్పీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు తోట సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నియామకం చేపట్టారు. గురువారం తోట సాంబశివరావు కంకిపాడులో విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైఎస్సార్ టీఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తాజా కమిటీలో రాష్ట్ర కార్యదర్శిగా నియమించటం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి విప్లవాత్మక విధానాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నూతన సంస్కరణలతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యాభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి పాటుపడతామని చెప్పారు. తనకు బాధ్యతలు అప్పగించిన ఎంపీ విజయసాయిరెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జాలిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 425 వీధి కుక్కలకు, పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశామని వీఎంసీ వెంటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఏ. రవిచంద్ తెలిపారు. గురువారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, యు. భవానీపురం ఐరన్ యార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో పశువర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ వి.గోపీచంద్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు ప్రాణాంతకమైన వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రాణాంతక వ్యాధులైన ర్యాబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీవ కారుణ్య సంస్థ ప్రతినిధి వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌లు డాక్టర్ సృజని, డాక్టర్ టి. సాయిగోపాల్ పాల్గొన్నారు.



కుక్కకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

ఆషాఢం.. వైభవం

సారె సమర్పణకు తరలివస్తున్న భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో ఆషాఢ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. విజయవాడకు చెందిన వాసవి షైన్ విజయం వారి ఆధ్వర్యంలో అర్జున వీధి నుంచి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి తరలి వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. అర్జున వీధి నుంచి ప్రారంభమైన ఊరేగింపులో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబులు పాల్గొన్నారు.

తరలివస్తున్న భక్త బృందాలు

అమ్మవారికి సారెను సమర్పించేందుకు విజయవాడ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త జనంతో మహా మండపం ఆరో అంతస్తు కిటకిటలాడింది. అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. విజయవాడకు చెందిన గుండపు నిర్మలకు చెందిన 150 మంది భక్తులు, సింగ్‌నగర్‌కు చెందిన శాంభవికి చెందిన 108 మంది భక్తులు, శ్రీ సద్గురు రాఘవేంద్ర మహిళా సమాఖ్యకి చెందిన 60 మంది భక్తులతో పాటు మొత్తం 1,500 మంది భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు.



భక్తబృందంతో ఇంద్రకీలాద్రికి విచ్చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ రాంబాబు

దత్తసాయికి రూ. లక్ష విరాళం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో శ్రీషిర్డీసాయిబాబావారికి వెండి సింహాసనం కోసం నగరానికి చెందిన దాత చేవూరి విజయ రూ. లక్ష విరాళాన్ని మందిరం వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావుకు అందజేశారు. అలాగే మధురానగర్‌కు చెందిన గౌతమ స్కూల్ అధినేత రూ.25వేలు విరాళం అందజేశారు.

విశేష పూజలు

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సంకట చతుర్థి పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు శ్రీ విజయగణపతి స్వామి వారికి విశేషంగా రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వేడుకగా మంగళంపల్లి జయంతి

విజయవాడ కల్చరల్: డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ సంగీత సేవలు వెలకట్టలేనివని విశ్వమాతా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. శ్రీ రామసరసి శ్రీ రామతత్వ ప్రచార సంగీత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శివరామకృష్ణ క్షేత్రంలో గురువారం సంగీత విద్వాంసుడు ప్రమోక్త డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ 93వ జయంతి వేడుక నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు వారి కీర్తి పతాకను సంగీత ప్రతిభద్వారా ప్రపంచానికి చాటిన మహనీయుడు మంగళంపల్లి అని అభివర్ణించారు. ఆయన సంగీత ప్రయాణం నగరంలోనే ప్రారంభమైందన్నారు. సంగీత విద్వాంసుడు కస్తూరి గోపాలరావు, రామకోటి ధర్మాధికారి శిష్యాల హనుమత్ ప్రసాద్, రామసరసి సేవా సంస్థ బాధ్యులు డాక్టర్ సీఎల్‌వీ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



వేడుకలు ప్రారంభిస్తున్న నిడుమోలు రమాసత్యనారాయణ

బాలమురళీకి స్వరాంజలి..

బాలమురళీ కృష్ణ రచించి స్వరపరచిన సంకీర్తనలతోపాటు సంగీత మూర్తిత్రయమైన త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి సంకీర్తనలను కస్తూరి గోపాలరావు మధురంగా ఆలపించారు.

సంగీత కళాశాల ఆధ్వర్యంలో..

దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో బాలమురళీ కృష్ణ 93 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుబొట్ల కృష్ణవేణి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు.

గంజాయి విక్రయించిన వ్యక్తికి జైలు

విజయవాడ స్పోర్ట్స్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తికి ఏడు నెలల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వై.శ్రీనివాసరావు గురువారం తీర్పు చెప్పారు. విజయవాడ వన్‌టౌన్ మల్లికార్జునపేటకు చెందిన 23 ఏళ్ల తాడిశెట్టి వెంకటరమణ గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంలో గత ఏడాది నవంబర్ 20వ తేదీన పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణ కిశోర్ కోర్టుకు వాదనలు వినిపించారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకటరమణకు న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.